క్లుప్తంగా

మద్యంతాగి వాహనాలు నడపొద్దు

ఎస్‌ఐ రాజ్‌కుమార్



బ్రీత్‌ఎనలైజర్‌తో పరీక్షలు చేస్తున్న ఎస్‌ఐ

దౌల్తాబాద్‌: మద్యంతాగి వాహనాలు నడిపితే కఠినచర్యలు తప్పవని ఎస్‌ఐ రాజ్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని పోచమ్మతండా వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా మద్యంతాగి వాహనాలు నడుపుతున్న వారిని బ్రీత్‌ఎనలైజర్‌తో పరీక్షలు నిర్వహించారు. వాహనదారుల వాహన పత్రాలను పరిశీలించారు. వాహనాలకు సంబంధించిన జిరాక్స్ కాపీలను తమ వద్ద ఉంచుకోవాలని సూచించారు. హెల్మెట్ లేకుండా, వాహనాల నంబర్ ప్లేటు లేకుండా ప్రయాణిస్తే జరిమానా విధిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ వెంకట్రాములు, సిబ్బంది చంద్రశేఖర్ అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ తెగిన డైవర్షన్ బ్రిడ్జి రోడ్డు

- బెల్కటూర్ వద్ద ఘటన
- రాకపోకలకు అంతరాయం



బెల్కటూర్ బ్రిడ్జి వద్ద తెగిపోయిన డైవర్షన్ రోడ్డు

తాండూరు రూరల్‌: మండలంలోని బెల్కటూర్ గ్రామ సమీపంలో నూతనంగా బ్రిడ్జి వద్ద నిర్మించిన డైవర్షన్ రోడ్డు మళ్లీ తెగిపోయింది. శనివారం మధ్యాహ్నం ఈ సంఘటన జరగడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో తాండూరు–కరన్‌కోట్ మార్గంలో రవాణా వ్యవస్థ పూర్తిగా నిలిచిపోయింది. విషయం తెలుసుకున్న కరన్‌కోట్ పోలీసులు తెగిన రోడ్డు నుంచి ఎలాంటి వాహనాలు వెళ్లకుండా బందోబస్తు నిర్వహించారు. బెల్కటూర్ బ్రిడ్జి రోడ్డు తెగిపోవడం వారంలో ఇది రెండోసారి.


సమాచార బోర్డులకు అడ్డుగా ఫ్లెక్సీలు



గ్రామ సరిహద్దు బోర్డు కనిపించకుండా హోటల్ నిర్వాహకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

బొంరాస్‌పేట: మండల పరిధిలోని జాతీయరహదారి పొడుగునా సమాచార బోర్డులకు అడ్డుగా ప్రైవేట్ ఫ్లెక్సీలు వెలుస్తున్నాయి. వివరాలు ఇలా ఉన్నాయి.. ప్రభుత్వ ప్రధాన సమాచారాల బోర్డులు, ట్రాఫిక్ నిబంధనలు వంటివి కనిపించకుండా ప్రైవేట్ వ్యాపారులు ఆయా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నాయి. దీంతో అసలు విషయం తెలియక వాహనదారులు, స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయాన్ని పట్టించుకునే వారు కరువయ్యారు. సంబంధిత అధికారులు స్పందించి సంబంధిత బోర్డులపై కప్పేసిన ప్రైవేట్ వ్యాపారుల ప్రకటనలు, ఫ్లెక్సీలను తొలగించాలని పలువురు కోరుతున్నారు.

కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం



కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

దౌల్తాబాద్‌: సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడికౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మను శనివారం మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో దహనం చేశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ ఫోన్ ట్యాపింగ్‌పై ఆధారాలు లేకుండా సీఎంపై అసత్య ఆరోపణలు చేసినందుకు వెంటనే ముఖ్యమంత్రికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఫోన్ ట్యాపింగ్‌లు చేసే అవసరం సీఎంకు, కాంగ్రెస్‌కు అసలే లేదన్నారు. ఇకముందు ఇలాంటి ఆరోపణలు చేస్తే సహించమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వీరన్న, నర్సప్ప, మహిపాల్, కృష్ణ, రెడ్యానాయక్, షఫీ, నరేందర్, రమేష్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

టీచర్ల కొరత!



బిచ్చాల ఉన్నత పాఠశాల



ఒకే గదిలో మూడు తరగతుల విద్యార్థులకు బోధన

- చదువులకు ఆటంకం
- రిలీవ్ కాకుండానే బదిలీలు
- రెండేళ్లుగా బోధనకు దూరం
- విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యం
- ఇబ్బందుల్లో విద్యార్థులు
- పట్టించుకోని అధికారులు

దౌల్తాబాద్‌: ప్రభుత్వం విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నామని, మౌలిక వసతులు కల్పిస్తున్నామని అనేక సభల్లో కూడా చెప్పుకుంటుంది. వాస్తవ విషయానికొస్తే ఆయా పాఠశాలల్లో సరిపడా సిబ్బంది లేక పాఠాలు సకాలంలో పూర్తికాకపోవడంతో చదువులు ముందుకు సాగడం లేదు. విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఈ విషయంలో పట్టించుకునే అధికారులు కరువయ్యారు. ఉపాధ్యాయ పోస్టులపై విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో సిబ్బంది లేక సరైన బోధన జరగడంలేదు. మండలంలో బిచ్చాల గ్రామంలోని ఉన్నత పాఠశాలలో 138 మంది చదువుతున్నారు. ఇక్కడ ముగ్గురే ఉపాధ్యాయులు ఉన్నారు. తెలుగు, బయోసైన్స్, సాంఘీకశాస్త్రం సబ్జెక్టులకు టీచర్లు లేరు. సరైన సిబ్బంది లేకపోవడంతో విద్యకు దూరమవుతున్నారు. రెండేళ్లుగా మూడు సబ్జెక్టులకు టీచర్లు లేకపోవడంతో ఒకే ఆవరణలో కూర్చొబెట్టి పాఠాలు చెబుతున్నారు. అలాగే అక్కడే ప్రాథమిక పాఠశాలలో 78 మంది విద్యార్థులకు ఇద్దరు మాత్రమే ఉన్నారు. ఉన్నత స్థాయి అధికారులు స్పందించి అవసరమైన మేరకు టీచర్లను నియమించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఉన్నతాధికారుల ఒత్తిడి మేరకు..

మండలంలోని ఇండాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఒక ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం, ఇద్దరు టీచర్లు పని చేస్తున్నారు. అయితే ఎల్‌ఎఫ్‌ఎల్ టీచర్‌కు ఎలాంటి రిలీవ్ ఆర్డర్ రాకముందే బదిలీ అవుతున్నారు. ఈ విషయంలో ఉన్నతాధికారుల ఒత్తిడి మేరకు ప్రత్యామ్నాయ టీచర్ నియామకం కాక ముందే రిలీవ్ అవుతున్నారు.

పట్టించుకోని విద్యాశాఖ అధికారులు

మండలంలో ఉపాధ్యాయుల కొరత ఉందని ఉపాధ్యాయులు, స్థానిక ప్రజాప్రతినిధులు జిల్లా విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోరు. పలు మార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. గతేడాది బిచ్చాల పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉందని ఎంఈఓకు స్థానికులు వినతిపత్రం అందజేశారు. సుల్తాన్‌పూర్, తిమ్మాయిపల్లి, గుముడాల, చంద్రకల్ తదితర పాఠశాలల్లో కూడా ఉపాధ్యాయుల కొరత ఉంది. ఇటీవల ఉపాధ్యాయుల నిష్పత్తి ప్రకారం పాఠశాలలో అదనంగా ఉన్నవారిని సమీపంలోని పాఠశాలలకు డిప్యూటేషన్ల ద్వారా సర్దుబాటు చేయాలని రాష్ట్ర విద్యాశాఖ ఉత్తర్వులు ఇచ్చింది. ఈ ప్రకారం మండలంలోని 12 మంది ఉపాధ్యాయులను ఖాళీగా ఉన్న పాఠశాలలకు వెళ్లాలని మండల విద్యాశాఖ అధికారులు ఆదేశాలు జారీచేశారు. ఐనప్పటికీ ఏ ఒక్క ఉపాధ్యాయుడు వెళ్లలేదు. ఇప్పటికైనా జిల్లా విద్యాశాఖ అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

పరీక్షలు ఎలా రాస్తాం



సాంఘిక, తెలుగు, బయోసైన్స్ టీచర్లు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. తమకు ఆ సబ్జెక్టు పాఠాలు చెప్పకుంటే ఎలా అర్థం చేసుకోవాలి? పరీక్షలు ఎలా రాయాలి? సీఎం నియోజకవర్గంలోని పాఠశాలలో సరిపడా టీచర్లు లేకపోవడం బాధాకరం.

– భువనేశ్వరి, పదోతరగతి, బిచ్చాల

డీఈఓకు సమస్య వివరించాం



బిచ్చాల గ్రామంలో టీచర్ల కొరత ఉందని డీఈఓకు నాలుగైదు సార్లు కలిసి సమస్య వివరించాను. టీచర్లను సర్దుబాటు చేస్తానన్నారు. అలాగే ఎంఈఓకు చెప్పినా పట్టించుకోవడం లేదు. అయితే ఈ విషయం గురించి ఎమ్మార్సీ కార్యాలయంలో మాత్రం సర్దుబాటు చేసినట్లుగా రికార్డుల్లో ఉంది. ఈ విషయం గురించి ఉన్నతాధికారులు స్పందించాలి.

– నర్సింగ్‌ఖాన్‌సింగ్, మాజీఎంపీపీ, దౌల్తాబాద్

ఉన్నతాధికారులకు నివేదించాం

మండలంలో కొన్ని పాఠశాలల్లో టీచర్ల కొరత ఉంది. ఈ సమస్యను ఉన్నతాధికారులకు వివరించాం. ఇండాపూర్‌లో పని చేస్తున్న ఎల్‌ఎఫ్‌ఎల్ టీచర్ రిలీవ్ లేకున్నా బదిలీ విషయంపై అధికారులనుంచి ఆదేశాలు వచ్చాయి. దీంతో టీచర్ ఇక్కడి నుంచి బదిలీ అయ్యారు.

– వెంకట్‌స్వామి, ఎంఈఓ, దౌల్తాబాద్

దైవభక్తి కంటే దేశభక్తి గొప్పది



తాండూరు టౌన్‌: కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న విద్యార్థినులు, ఉపాధ్యాయులు, తదితరులు

- వందేమాతరం ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు రవీందర్
- ఘనంగా కార్గిల్ విజయ్‌దివస్

తాండూరు టౌన్‌: దైవభక్తి కంటే దేశభక్తి గొప్పదని వందేమాతరం ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు రవీందర్ పేర్కొన్నారు. శనివారం కార్గిల్ విజయ్ దివస్‌ను పురస్కరించుకుని పట్టణ శివారులోని తెలంగాణ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో నిర్వహించిన వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్గిల్ యుద్ధంలో వీరమరణం పొందిన జవాన్లకు ఆత్మశాంతి కలగాలని కోరుతూ కొవ్వొత్తులతో నివాళులర్పించారు. యువతులు సైతం సైన్యంలో చేరి భారత్‌కు రక్షణగా నిలవాలన్నారు. అనంతరం విద్యార్థినులు పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హస్నాబాద్‌కు చెందిన రిటైర్డ్ జవాన్ అన్నమయ్య, ఎంబీబీఎస్ సాధించిన పూర్వ విద్యార్థిని హారికను సన్మానించారు. ప్రోగ్రాం నిర్వాహకులు వెంకట్, శ్రీరామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు బాలకృష్ణ, పాఠశాల ప్రిన్సిపాల్ ప్రవీణ, రిటైర్డ్ టీచర్ బిచ్చప్ప తదితరులు పాల్గొన్నారు.



అనంతగిరి: నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

మేరా భారత్ మహాన్

అనంతగిరి: దేశం కోసం ప్రాణాలర్పించిన వీరజవాన్లకు దేశం ఎల్లప్పుడు అండగా ఉంటుందని వికారాబాద్ బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొప్పుల రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం అమరులైన వీర జవాన్లకు భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యాలయంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సదానంద రెడ్డి, రాష్ట్ర ఎస్సీ మోర్చా కార్యదర్శి నవీన్ కుమార్, బీజేపీ సీనియర్ నాయకుడు ప్యాట శంకర్, వికారాబాద్ మండల అధ్యక్షుడు శివరాజ్ గౌడ్, మోహన్ రెడ్డి, రాఘవేందర్, ప్రవీణ్ రెడ్డి, హనుమంత్ రెడ్డి, సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తిమార్గంతో సత్ప్రవర్తన

భవానీ మాత పీఠాధిపతి శంకర్ స్వామిజీ

బషీరాబాద్‌: భక్తిమార్గంతో మనిషిలో సత్ప్రవర్తన వస్తుందని అంబా భవానీమాత పీఠాధిపతి, తెలంగాణ సాధుపరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీ శంకర్ స్వామిజీ పేర్కొన్నారు. శనివారం దామర్‌చెడ్‌లోని భవానీ నగర్‌లో వెలసిన అంబాభవానీ మాతను వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శనం చేసుకున్నారు. అలాగే ఆలయ వ్యవస్థాపకులు శ్రీమాణిక్యప్ప స్వామిజీ 21వ ఆరాధన మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రుద్రాభిషేకం, పుష్పార్చన, సహస్ర బిల్వార్చన, మహాహారతి ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు పీఠాధిపతి ప్రవచనాలు చెప్పారు. పాశ్చాత్య పోకడలతో నేటి యువత పెడదారి పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతీ ఇంట్లో పిల్లలకు చిన్ననాటి నుంచి సంస్కృతి, సంప్రదాయాలను నేర్పించాలని సూచించారు. భవానీమాత ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం ఆలయ కమిటీ భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులతో పాటు తాండూరు పట్టణ బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

రుక్మిణి పాండురంగస్వామి దేవాలయంలో..

కుల్కచర్ల: బండవెల్కిచర్ల రుక్మిణి పాండురంగస్వామి దేవాలయంలో శనివారం భగవద్గీత పారాయణం, హనుమాన్ చాలీసా, శ్రీరామ నామ సంకీర్తనల గానం నిర్వహించారు. 156 రోజులుగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు హిందూ సంఘాల నాయకులు తెలిపారు.

ఉద్యోగులకిచ్చిన హామీలు నెరవేర్చాలి

కొడంగల్ రూరల్‌: ఉద్యోగులకిచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చేందుకు చర్యలు తీసుకోవాలని పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు గుండు లక్ష్మణ్ పేర్కొన్నారు. మండలంలోని చిట్లపల్లి యూపీఎస్ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు యాదగిరి ఉద్యోగ విరమణ సందర్భంగా పట్టణంలోని రెడ్డి బసరెడ్డి ఫంక్షన్ హాల్లో శనివారం నిర్వహించిన సన్మాన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేష్‌రెడ్డి, ఎంఈఓలు రాంరెడ్డి, హరిలాల్, విజయ రామారావు, వెంకటస్వామి, పీఆర్టీయూ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మాజీ అధ్యక్షుడు గట్టు వెంకట్‌రెడ్డి, మండల అధ్యక్షుడు అబ్దుల్‌హాఖ్ పాల్గొన్నారు.



యాదగిరిని సన్మానిస్తున్న పీఆర్టీయూ నాయకులు, అభిమానులు

బ్యాంకు రుణాలతో లబ్ధి పొందుతున్నాం

- ధారూరు మహిళా సంఘం సభ్యులు
- నాగారం గ్రామాన్ని సందర్శించిన నేషనల్ లెవల్ మానిటరింగ్ టీమ్



పంచాయతీ రికార్డులను పరిశీలిస్తున్న జొసైల్ జోసెఫ్ తదితరులు

ధారూరు: సార్, కూలి పనులు చేసుకుంటూ జీవనం గడిపాం. డ్వాక్రా గ్రూపుల్లో చేరి పొదుపు చేసుకుంటూ రుణాలు తీసుకుని లబ్ధిపొందుతున్నామని ధారూరు మహిళా సంఘం సభ్యులు నేషనల్ లెవల్ మానిటరింగ్ టీం సభ్యులతో వివరించారు. మండల పరిధిలోని నాగారం గ్రామాన్ని శనివారం నేషనల్ లెవల్ మానిటరింగ్ టీం లీడర్ జొసైల్ జోసెఫ్, టీం సభ్యులు ఎంపీడీఓ నర్సింహులుతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన మహిళా పొదుపు సంఘం సభ్యులతో వారు మాట్లాడారు. బ్యాంకులో రుణాలు తీసుకోక ముందు ఏలా ఉన్నారు? రుణాలు తీసుకన్నా తర్వాత జీవనశైలి ఎలా ఉందని ప్రశ్నించారు. దీనికి ఓ మహిళ ముందుకు వచ్చి సార్ నేను గతంలో కూలీ పనులు చేశానని, బ్యాంకు రుణం తీసుకుని పిండిగిర్నీ పెట్టుకున్నట్లు చెప్పారు. అలాగే రెండు కుట్టు మిషన్లు తీసుకున్నానని దీంతో నెలకు రూ. 8వేల నుంచి రూ. 15వేల వరకు ఆదాయం వస్తుందని చెప్పారు. తనకు పొలం ఉందని తీసుకున్న రుణంతో 8 గేదెలు తీసుకున్నట్లు, ప్రస్తుతం 5 గేదెలు పాలు ఇస్తున్నాయని, మరో 3 ఈనడానికి సిద్ధంగా ఉన్నాయని మరో మహిళా వివరించింది. తనకు నెలకు రూ.9వేల వరకు ఆదాయం సమకూరుతుందని చెప్పింది. అనంతరం వారు గ్రామంలో నిర్వహించిన జాతీయ ఉపాధిహామీ పథకానికి సంబంధించిన పనులను పరిశీలించారు. ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన కింద మంజూరైన సీసీ రోడ్లను, తర్వాత గ్రామ పంచాయతీ రికార్డులను పరిశీలించారు. పశువుల పాక, రోడ్డుకు ఇరువైపుల ప్లాంటేషన్, వ్యవసాయ భూములకు వెళ్లడానికి మట్టి రోడ్డు, నర్సరీలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీనివాస్, ఎంపీడీఓ నర్సింహులు, ఎంపీఓ షఫీఉల్లా, ఇన్‌చార్జి ఏపీఓ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీలకే కేటాయించాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

- హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ వాహబ్

యాలాల: పట్టణ శివారులో గతంలో నిర్మించిన వంద పడకల హాస్టల్ భవనాన్ని మైనార్టీలకే కేటాయించాలని మైనార్టీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ వాహబ్ అన్నారు. ఈ విషయమై శనివారం సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, ఎస్సీ, ఎస్టీ, బీసీ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు చంద్రయ్య తదితరులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..గత ప్రభుత్వం మైనార్టీ విద్యార్థుల కోసం వంద పడకల వసతి గృహాన్ని నిర్మించి కేటాయించింది. కానీ దాన్ని వినియోగంలోకి తీసుకురాలేదన్నారు. ప్రతి ఎన్నికల సమయంలో పోలీస్ శాఖ అధికారులు బస చేసేందుకు ఈ భవనాన్ని వినియోగిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల కోసం కేటాయించిన భవనాన్ని ఇతర అవసరాలకు వాడుకోవడం సరికాదన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం, అధికారులు స్పందించకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ హక్కుల పోరాట సమితి పట్టణ అధ్యక్షుడు సాధిక్, నాయకులు అంజద్, జాకీర్, ఎమ్మార్పీఎస్ పట్టణ అధ్యక్షుడు బలరాం, కార్యదర్శి రవి, రాములు తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం

- మున్సిపల్ కమిషనర్ విక్రంసింహారెడ్డి
- ఎస్టీ గురుకుల విద్యాలయం తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ విక్రంసింహారెడ్డి

తాండూరు: ప్రతీరోజు విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని తాండూరు మున్సిపల్ కమిషనర్ విక్రంసింహారెడ్డి పేర్కొన్నారు. సాయిపూర్ ప్రాంతంలోని ఎస్టీ బాలికల గురుకుల విద్యాలయాన్ని శనివారం ఆయన తనిఖీ చేశారు. విద్యాలయంలో విద్యార్థుల హాజరు శాతాన్ని పరిశీలించి మాట్లాడారు. మధ్యాహ్న భోజన నిర్వాహకులు మెనూను తప్పనిసరిగా పాటించాలన్నారు. అనంతరం విద్యార్థులు ఏమైనా సమస్యలు ఎదుర్కొంటున్నారా? అని వారిని అడిగి తెలుసుకున్నారు. వర్షం పడితే వరద నీరు గురుకుల విద్యాలయ ప్రాంగణంలోకి చేరుతుందని ఉపాధ్యాయులు, విద్యార్థులు కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. అంతే కాకుండా సోలార్ విద్యుత్ ప్లాంట్ ద్వారా విద్యుత్‌సరఫరా నిలిచిపోయిందని వివరించారు. ఈ విషయాల గురించి జిల్లా కలెక్టర్‌కు నివేదిక పంపిస్తానని పేర్కొన్నారు.

లైసెన్సుడ్ సర్వేయర్ల పరీక్ష ఏర్పాట్ల పరిశీలన



పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

అనంతగిరి: గ్రామ పరిపాలన అధికారి, లైసెన్సుడ్ సర్వేయర్ల పరీక్ష నిర్వహణకు పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ అధికారులకు సూచించారు. శనివారం వికారాబాద్ పట్టణ కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం గ్రామ పరిపాలన అధికారి, లైసెన్సుడ్ సర్వేయర్ల పరీక్ష నిర్వహించే కేంద్రాన్ని అధికారులతో కలిసి అదనపు కలెక్టర్ సందర్శించారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు. ఆయన వెంట ఆర్డీవో వాచ్ చంద్ర, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ రాంరెడ్డి, డీఎం డబ్ల్యూఓ రాజేశ్వరి, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, హెచ్ సెక్షన్ సూపరింటెండెంట్ నేమత్ అలీ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి నుంచి బయటకు రావద్దు

- ఎంపీడీఓ విజయలక్ష్మి

మోమిన్‌పేట: రానున్న రెండు, మూడు రోజులు భారీ వర్షాలు కురవనుండడంతో ఇంటి నుంచి ఎవరు బయటకు రావద్దని ఎంపీడీఓ విజయలక్ష్మి పేర్కొన్నారు. శనివారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మూడు, నాలుగు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయని, బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం వల్ల అల్పపీడనద్రోణితో రానున్న రెండు మూడు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపిందన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వాగులు, కాల్వలు, చెరువులు దాటే సమయంలో జాగ్రత్తగా దాటాలన్నారు. శిథిలావస్థకు చేరిన ఇండ్లలో నివాసం ఉండొద్దని సూచించారు. కార్యదర్శులు గ్రామాల్లో పర్యటించి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు.

రోడ్డు బాగు చేయించాలని బీజేపీ ధర్నా



మండల కేంద్రంలో ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు

నవాబుపేట: ఆర్కతల చౌరస్తా నుంచి చిట్టిగిద్ద చౌరస్తా వరకు ప్రధాన రోడ్డు గుంతలమయంగా మారడంతో బాగుచేయించాలని కోరుతూ బీజేపీ నాయకులు ధర్నా నిర్వహించారు. శనివారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ సమీపంలోని ప్రధాన రోడ్డుపై కూర్చొని వారు నిరసన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి, స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్యకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అక్కడ ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులను పోలీసులు అరెస్టుచేసి సొంత పూచీకత్తుపై వారిని వదిలేశారు. అనంతరం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో పలువురు మాట్లాడారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని పార్టీ నాయకులు కష్టపడి పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చంద్రకాంత్, ప్రధాన కార్యదర్శిలు ప్రభాకర్ రెడ్డి, శ్రీధర్, రాష్ట్ర ఐటీ సెల్ కో కన్వీనర్ శ్రీకాంత్ రెడ్డి, జిల్లా కార్యదర్శి జగన్, ఉపాధ్యక్షుడు మహేందర్ రెడ్డి, కార్యదర్శులు రవీందర్, మహేందర్, సీనియర్ నాయకులు మల్లేశం, రాములు గోపాల్, పాండురంగారెడ్డి నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ఎడతెరిపి లేని వర్షం

- రైతుల హర్షం



దోమలో జలకళ సంతరించుకున్న పెద్ద చెరువు

మోమిన్‌పేట: మూడు, నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. బంగాళాఖాతంలో ఏర్పడ్డ వాయుగుండం వల్ల అల్పపీడన ద్రోణితో వర్షాలు కురుస్తున్నాయని అధికారులు వివరించారు. రానున్న రెండు, మూడు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం తెలపడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికే వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయని ప్రజలు చెబుతున్నారు.

దోమలో..

దోమ: మండల వ్యాప్తంగా వర్షాలు దంచి కొడుతున్నాయి. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు, చెరువులు, కుంటలు నిండి జలకళను సంతరించుకున్నాయి. దోమ మండల కేంద్రంలోని పెద్ద చెరువు నిండుకుండలా నిండడంతో అలుగుపారుతుంది. దీంతో రైతున్నలు, మత్స్యకారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సాగు చేసిన మొక్కజొన్న, పత్తి పంటల్లో నీరు చేరడంతో కొందరు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఆలయాలకు శ్రావణ శోభ

కుల్కచర్ల: శ్రావణమాసం తొలి శనివారాన్ని పురస్కరించుకుని కుల్కచర్ల మండల పరిధిలో ఆయా గ్రామాల్లోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. బండవెల్కిచర్ల గ్రామ పరిధిలోని శ్రీపాంబండ రామలింగేశ్వర దేవస్థానంలో భక్తులు ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. మండల పరిధిలోని ఆయా దేవాలయాల్లో భక్తులు ప్రత్యేకపూజలు నిర్వహించి ఉపవాసదీక్షలు ప్రారంభించారు.